# ధైర్యం

అదో రకం పరుగు... ప్రత్యేకించి వీళ్ళతోటే పోటీ అనీ లేదు. కానీ, వెనకపడిపోతే ఎలా అన్న భయం... చేరాల్సిన గమ్యం ఇదీ అన్న నిర్ధారణ లేదు... అన్నీ తెలుస్తూనే ఉన్నాయి. 'అప్పుడే సంవత్సరం గడచిపోయిందా?' అన్న ఆశ్చర్యం లతకి, కిరణ్‌కి.

కిందటి సంవత్సరం జూన్ ఇరవైన ఇద్దరికీ పెళ్ళి జరిగింది. ఈ సంవత్సరం జూన్ రెండోవారం చివరలో ఉన్నారు.

గడిచిన సంవత్సరాన్ని వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు రొటీన్‌గా జరిగినవే ఎక్కువ కనబడుతున్నాయి. ఉదయం ఇద్దరూ కలిసి కూచుని కాఫీ తాగే పది నిమిషాలు... సాయంత్రం ఇల్లు చేరాక నిద్రపోయేలోపు, అదీ ఇద్దరూ మెళకువగా ఉండగలిగే ఓపిక ఉంటే కలిసి మాట్లాడుకునే ఓ గంట... మిగిలిన ఇద్దరి జీవితం ఫోన్‌లోనే. ఇద్దరూ ఒకే ఊళ్ళో ఉన్నా, ఒకే ఇంట్లో కాపురం చేస్తున్నా... అంతా పరుగే.

ఎంత హడావిడైనా, పని ఒత్తిడిలో ఉన్నా లతకి అప్పుడప్పుడూ గతం అలలు అలలుగా మనసులో మెదులుతూ ఉంటుంది. తనూ,

కిరణ్ కలిసి ఎమ్.టెక్ చదువుతుండగా ఏర్పడిన పరిచయం, ముందు చదువుకి, కెరియర్‌కి సంబంధించిన కబుర్లే చెప్పుకోవటం, ప్రపంచవ్యాప్తంగా ఎంతో త్వరితంగా జరుగుతున్న సాంకేతిక మార్పుల గురించి... ఉద్యోగావకాశాల గురించి... ఆ కబుర్లలోనే కలిసి బతకటం గురించి... ఇప్పటికీ తలుచుకుంటే లతకి చిరుసిగ్గుగా,మురిపెంగా ఉంటుంది. తమిద్దరినీ జీవితం అతి సహజంగా, సాఫీగా దగ్గర చెయ్యటం... ఎంత అదృష్టం అనుకుంటుంది.

సరదాగా కబుర్లు సాగుతున్నప్పుడు "మన పాత విషయాలు ఎప్పుడైనా గుర్తొస్తుంటాయా?" అని కిరణ్‌ని ఓసారి అడిగింది లత.

"ఎందుకు గుర్తురావు... ఒకరి చేతిలో మరొకరి చెయ్యి... చీకటి పడీపడని సాయంత్రాల నడక... గంటలు గంటల కబుర్లు... కాపురం పెట్టగానే ఏం చెయ్యాలో, ఎలా ఉండాలో అన్న ఆలోచనలు..." అంటూ కిరణ్ చెబుతుంటే ఆ చేరువలో.... ఆ కొద్ది క్షణాల్లో ఎంతో తృప్తి లతకి.

రాను రాను... ఎప్పుడు, ఎలా జరిగిందో... ఇప్పుడు ఆ క్షణాలు అసలు ఉండటం లేదు... విశ్రాంతి లేదు... ఖాళీ సమయం లేదు... అంతులేని శ్రమ.

'ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటారు... ఆర్థికంగా ఇబ్బందులుండవు... వారానికి కనీసం రెండుసార్లేనా సరదాగా ఎటో అటు వెళ్ళాలి... నగరంలో ఏ మూల ఏ మంచి ప్రోగ్రాం జరిగినా... ముఖ్యంగా మంచి సంగీతం వింటూ మైమరచిపోయేలా... ఏ చిన్న అవకాశం వదలకూడదు... జీవితాన్ని కళాత్మకంగా... నిండుగా... తమిద్దరి అభిరుచికి తగినట్టు గడపాలి...' ఎప్పుడూ ఇలాంటి కబుర్లే చెప్పుకునేవారు.

కాపురం పెట్టిన ఓ నెలరోజులు తప్ప, ఆ తర్వాత ఆ ఊహలేవీ ఫలించలేదు. పెళ్ళి అయ్యేటప్పటికే ఇద్దరికీ ఉద్యోగాలున్నాయి. కొత్తగా చేరిన ఆఫీసు వాతావరణం, పోటీ ప్రపంచంలో తమకి తాము సమర్థులుగా నిరూపించుకోటంలో ఇద్దరూ సర్వం మరచిపోవాల్సి వచ్చింది.

ఇద్దరి ప్రాముఖ్యతా ఒక్కటే... ఉద్యోగం... సమర్థత... తల ఎత్తుకుని ధీమాగా బతకగలిగే కెరియర్... ఇద్దరికీ మంచి అవకాశాలే వచ్చాయి. టైము అన్న విషయాన్ని మరిచిపోయి, ఆఫీసు ఇల్లు ఒకటిగానే భావించి, అహర్నిశలు పనికే అంకితం అయిపోయి మంచిస్థాయికి, తోటివాళ్ళు గర్వంగా చూసే స్థాయికి చేరారు.

ఇంచుమించు ఇద్దరూ ఒకేసారి ఉద్యోగాలు మారారు. పెద్దస్థాయి విదేశీ సంస్థ ప్రారంభించిన బిజినెస్ ప్రాసెస్ ఆఫీసులో లత, సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ మేనేజర్‌గా కిరణ్... ఆదాయానికి లోటులేదు. కానీ లోటల్లా టైమే... ఇద్దర్లో ఎవరు ఎప్పుడు వస్తారో, ఎంతసేపు ఉండగలుగుతారో వాళ్ళకే తెలియదు.

ఉదయం లేస్తూనే మానసికంగా, శారీరకంగా ఉత్సాహాన్ని ఇంజెక్ట్‌చేసుకుంటారు. బైటికి కదిలి రకరకాల సమస్యల్ని, ఒత్తిడిని భరించి రాత్రికి అణుమాత్రమేనా ఓపికలేనట్టు ఇల్లు చేరతారు. రోజంతా వారి ఆలోచనా, శ్రమ... అంతా ఉద్యోగానికే. వేరుగా తమకోసం వారికి పట్టుమని పది నిమిషాలు సమయం కేటాయించుకున్నా అదొక బలవంతపు చర్యే.

లత, కిరణ్ పడిన శ్రమని, వారి ప్లానింగ్‌ని, వారు చేసిన పనుల్ని... తప్పని సర్వసాధారణంగా ఎవ్వరూ అనలేరు. ఇద్దరూ చెరో కారు కొనుక్కొన్నారు. లేకపోతే టైము సరిపోదు.

బ్యాంక్ వాళ్ళూ వాళ్ళంతగా వాళ్ళు వీరి దగ్గరికి వచ్చి లోన్ ఇచ్చారు. ఆ అవకాశం వదులుకోలేక లోన్ తీసుకుని త్రీ బెడ్‌రూం ఫ్లాట్ కొనుక్కున్నారు. కొత్త ఇంట్లోకి అవసరమైనవి, కొంచెం సౌఖ్యంగా గడపటానికి అవసరమైన వస్తువుల్ని తీసుకున్నారు. ఇన్‌కమ్‌టాక్స్, ఇన్‌స్టాల్‌మెంట్స్, లోన్స్, బిల్లులు పోను కొద్దిగా డబ్బు ఉంటుంది. గట్టిగా అవసరమైతే అప్పు తేలిగ్గా పుట్టే జీవనస్థాయిలోనే ఉన్నారు కాబట్టి ఇబ్బందిలేదు.

లతకి, కిరణ్‌కి తెలుస్తున్న ఇబ్బంది ఒక్కటే... విశ్రాంతికి సమయంలేని, శరీరం తట్టుకోలేని అలసట. అది వీరిద్దరికే పరిమితం కాదని తెలుసు. ఈ జీవన వేగం, . ప్రస్తుత జీవనవిధానంగా నమ్మి, అందులో ఇమిడిపోవాలని రకరకాలుగా, చాలా నగరాల్లో ప్రయత్నిస్తున్న లక్షల జంటలు ఉన్నాయనీ తెలుసు.

చాలా అరుదుగా దొరికే ఆదివారంనాడో, మరో శెలవు రోజో ఇల్లు సర్దుకోవటం లాంటి పనులు చేస్తున్నప్పుడు మాత్రం ఒక్కోసారి లతకి విపరీతమైన విసుగ్గా ఉంటోంది.

ఏమిటీ జీవితం? ఇది ఇంతేనా? ఈ పద్ధతే సరైందా? అన్న ప్రశ్నలు ముల్లులా పొడుస్తున్నాయి. కిరణ్‌కి విసుగు కలిగే సందర్భాలు లేకపోలేదు. భార్యాభర్తల్దిరూ ఈ విషయం మాట్లాడుకున్నారు. ఈ రొటీన్ గురించి మార్పు కావాలని ఇద్దరూ బలంగా కోరుకున్నారు.

ఆఫీసు పని, ఒత్తిడి లేకుండా ఏకాంతంగా గడపాలన్నది కోరిక. ఇంట్లో ఏకాంతానికేం లోటు లేదు. కానీ వాతావరణం మార్పు కూడా ఉంటే బావుంటుందన్నది ఆలోచన. వారం పదిరోజులు శెలవు పెట్టటం ఇద్దరికీ తేలిగ్గా సాధ్యపడే విషయంకాదు. ఆదివారాలు, శెలవురోజులు కూడా ఆఫీసుకి వెళ్ళాల్సి వస్తోంది. మహా శెలవు దొరికితే రెండు మూడు రోజులు. ఆ సమయంలో ఏ ఊరేనా వెళ్ళాలంటే... మంచి, చెడు లెక్కలేసుకున్నారు. విశ్రాంతి కన్నా, శ్రమే ఎక్కువయ్యేలా ఉంది. మరీ విచ్చలవిడిగా ఖర్చుచేసే అవకాశం లేదు. కమిట్‌మెంట్స్ చాలానే ఉన్నాయి.

ఆలోచించి, ఆలోచించి చివరికి ఇద్దరూ ఓ నిర్ణయానికి వచ్చారు. జూన్ ఇరవై...

మేరేజ్ డే...

ఆ రోజంతా లతా, కిరణ్ ప్రతి నిమిషం తమదిగా గడపాలనుకున్నారు. చకచకా అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇద్దరూ ఆరోజు శెలవు పెట్టారు. ముందుగానే షాపింగ్ పూర్తి చేశారు. అన్నీ అమర్చుకున్నాక... జూన్ ఇరవై పూర్తిగా ఇంటికి... విశ్రాంతికి... ఏకాంతానికి... ప్రశాంతంగా గడపటానికి కేటాయించారు.

×××

మొదటి సంవత్సరం పెళ్ళిరోజు ఇద్దరూ మామూలుగానే నిద్దరలేచారు. చిరు బద్ధకం... ఏ హడావిడి లేని ప్రశాంతత... ఇద్దరి మనసులూ ఎంతో తేటగా ఉన్నాయి. ఏ పనికీ ఒత్తిడి, తొందర లేకుండా సమయం గడపాలన్నదే వాళ్ళిద్దరి ముఖ్యమైన కోరిక. అలాగే తమ ఆలోచనల్ని మనసుని సెట్ చేసుకున్నారు.

తాపీగా కాఫీ తాగారు. తీరుబడిగా గడుపుతూ తలారా స్నానాలు చేసి కొత్తబట్టలు కట్టుకున్నారు. లత టిఫిన్ చేసింది. తృప్తిగా తిన్నారు. లత వంట ప్రయత్నంలోకి వెళ్ళాలని లేచిన రెండు నిమిషాలకి ఫోన్.

తప్పించుకునే అవకాశం లేదు. హెడ్ ఆఫీసు నుంచి సి.ఇ.ఓ. పూర్తి టీమ్‌తో దిగాడట. ఆఫీస్‌కి అర్జంట్‌గా వెళ్ళాలి. నీరసపడిన లతకి కిరణ్ నచ్చజెప్పి మరీ పంపించాడు. గంటా, రెండు గంటల్లో బైటపడదామనుకున్న లతకి ఎంతమాత్రం వీలుకాలేదు.

ప్రతి నిమిషం నరకంలా ఉంది. చిన్న పని కూడా పెద్ద బరువులా ఉంది. ఇంత అస్వతంత్ర జీవితమా? ఇంట్లో కిరణ్ ఒక్కడూ ఎదురుచూస్తూ... భోజనం కూడా లేకుండా... పెళ్ళిరోజున...

లతకి కన్నీరు పెట్టుకునే అవకాశం కూడా లేదు. చుట్టూ జనం... అంతకీ పెల్లుబికి వచ్చిన ఒకటి రెండు కన్నీటి చుక్కల్ని కంట్లో ఏదో నలక పడినట్టు నటిస్తూ తుడుచుకుంది.

రాత్రి రెండు దాటాక ఆఫీసువాళ్ళూ కూడావచ్చి మరీ లతని ఇంటి దగ్గర దించి వెళ్ళారు. కిరణ్ వచ్చి తలుపు తీశాడు.

ఇద్దరికీ నిస్సత్తువ... ఒకర్ని మరొకరు చూసుకోలేనంత ఆశాభంగం. “పది నిమిషాల్లో వంట చేసేస్తా...” అంది లతే ముందు తేరుకుని.

“ఇప్పుడేం వద్దులే... నేనే అన్నం వండి, సాంబారు చేశా... ఛండాలంగా ఉన్నా తినేయాలి...” అన్నాడు నవ్వుతూ. తెల్లారుఝామున అయిదింటికి కానీ ఇద్దరూ పూర్తిగా తేరుకోలేకపోయారు. దిగులుగా తలదించుకు కూచున్న లతని చూస్తూ...

"దేనికీ దిగులు పడకూడదు లతా... ఆవేశంలో ఉద్యోగం మానేస్తానంటున్నావు. అది సరికాదు. మానేస్తే మన కమిట్‌మెంట్స్‌తో మరింత ఇబ్బందేగా... మనిద్దరమే కాదు. మనకన్నా నిరాశపడి... రకరకాలుగా నలిగిపోతున్న వారు లక్షల్లో ఉన్నారు. మేరేజ్ డే... రాత్రి రెండు తర్వాతేనా తెల్లారే లోపేనా... దగ్గరగా ఉండగలగటం ఎంత అదృష్టమో అది గమనించు..." అన్నాడు కిరణ్.

మరికొంచెం సేపు అలాంటి మాటలే చెప్పాడు కిరణ్. అవన్నీ లతకి తెలియనివేం కావు. కానీ కొత్తగా తెలుసుకుంటున్నట్టు విని, భర్త మాటలని సమర్థిస్తున్నట్టు తలూపింది. ఎప్పుడేనా లత అలా మాట్లాడినా కిరణ్ కూడా అలాగే సమర్థిస్తాడు. ఏ రకంగా కళ్ళు చెమర్చినా, ఏదో రకంగా ధైర్యంగా మార్చుకోవటమే ఇప్పటి జీవితం మరి.

- తెలుగు పలుకు - తానా సమావేశాల సంచిక - 2005